నిరుపయోగంగా బస్ షెల్టర్లు

- ఉండాల్సిన చోట లేవు
- ప్రయాణికులకు పాట్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో పలువురు దాతలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు బస్ షెల్టర్లు నిర్మించారు. అప్పట్లో సిటీ బస్సుల సంచారం ఎక్కువగా ఉండేది. ఆటోలు అందుబాటులోకి రావడంతో సిటీ బస్సుల ఉనికి అంతరించిపోయింది. ఆటోవాలాలు ఎక్కడ కావాలంటే అక్కడ ఆటోలను ఆపుతూ, ఎక్కడ కావాలంటే ప్రయాణికులు ఎక్కించుకుంటూ వారి గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నగరం నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణించే ప్రజలు బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో నగరంలోని పలు బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారాయి.

అవసరం లేనిచోట షెల్టర్లు

ఏలూరు కొత్త బస్టాండును ఆనుకుని ఒక సినీ హీరో ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు బస్ షెల్టర్ నిర్మించారు. అయితే ఈ షెల్టర్‌ను వివిధ కారణాలతో గతంలోనే తొలగించారు. ఆర్టీసీ డిపో గ్యారేజ్ ప్రాంతంలో ఒక క్లబ్ ప్రతినిధులు నిర్మించిన బస్ షెల్టర్ వద్ద ప్రయాణికులు వేచి ఉండాల్సిన అవసరం లేక పోవడంతో భిక్షకులకు, మందుబాబులకు అడ్డాగా మారింది. టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని మరో బస్ షెల్టర్ కూడా ప్రయాణికులకు అవసరం లేకపోవడంతో భిక్షాటన చేసే వారు



టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్



ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద ఎండలోనే ప్రయాణికుల అవస్థలు

వినియోగిస్తున్నారు. పాత బస్టాండు వద్ద ఉన్న ఆటో, జీపు స్టాండు వద్ద ఒక బస్ షెల్టర్ ఆటో డ్రైవర్లకు నీడనివ్వడానికి, వసంతమహల్ వద్ద ఉన్న బస్ షెల్టర్ కొందరు పురోహితులు సేద తీరడానికి ఉపయోగపడుతున్నాయి. జూట్ మిల్లు వద్ద ఉన్న బస్ షెల్టర్ వీధి వ్యాపారులకు అడ్డాగా మారింది.

కావాల్సిన చోట లేవు

ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి ప్రతి రోజూ కనీసం వెయ్యి మందికి పైగా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి బస్సుల కోసం వేచి ఉంటుంటారు. జిల్లా కేంద్రం కావడంతో పోలీస్, విద్యాశాఖ కార్యాలయాలకు, జిల్లా న్యాయ స్థానానికి, సర్వజన ఆసుపత్రికి ఇలా వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చే వారు తమ పని ముగిసిన తరువాత గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో బస్సుల కోసం వేచి చూస్తుంటారు. తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, ద్వారకా తిరుమల, నరసాపురం, పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, కైకలూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇక్కడే బస్సులు ఎక్కుతుంటారు. ఈ ప్రాంతంలో ఉండే ఒక పెద్ది మర్రి చెట్టు 15 సంవత్సరాల క్రితం వరకు ప్రయాణికులకు నీడనిచ్చేది. రోడ్డు విస్తరణలో భాగంగా ఆ చెట్టును తొలగించడంతో ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. చింతలపూడి, సత్తుపల్లి, వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అధిక సంఖ్యలో అమీనాపేట ప్రాంతంలో వేచి ఉంటారు. వీరికి ఇక్కడున్న బస్ షెల్టర్ సరిపోవడం లేదు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

ప్రయాణికులు ఎక్కువ మంది వేచి ఉండే ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేకపోవడం, ఉన్నా చాలకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఉన్న బస్ షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలని, ఆయా ప్రాంతాల్లోనే బస్సులు నిలుపుదల చేసే విధంగా చర్యలు తీసుకుంటే దాతల ఆశయం నెరవేరుతుందని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

వైభవంగా దసరా సంబరాలు



దసరా సంబరాల్లో కలశాలతో పాల్గొన్న మహిళలు

ఏలూరు (టూటౌన్) : స్థానిక తంగెళ్లమూడి తిలక్ నగర్‌లో దసరా సంబరాలు గురువారం వైభవంగా నిర్వహించారు. జగన్మాతకు జయ జయ ధ్వానాలు పలుకుతూ మంగళ వాయిద్యాలు, కలశాలు, మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. జగమేలు తల్లి కొలుతుము నిన్ను ప్రణమిల్లి అంటూ జగజ్జననిని కీర్తిస్తూ భక్తులు దివ్య నీరాజనాలు సమర్పించారు. ఎమ్మెల్యే బడేటి చంటి అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక కార్పొరేటర్ వందనాల భవాని శ్రీనివాస్, కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యుత్ ఏఓగా రాజశేఖర్



రాజశేఖర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యుత్ అధికారి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ అక్కౌంట్స్ అధికారి (ఫైనాన్స్)గా టి.రాజశేఖర్ గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఏలూరు జూనియర్ అక్కౌంట్స్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజశేఖర్‌కు పదోన్నతి కల్పించి ఈ స్థానంలో నియమించారు. విద్యుత్ సర్కిల్ పునర్ వ్యవస్థీకరణ అనంతరం ఏలూరు సర్కిల్ పరిధిలో సీనియర్ అక్కౌంట్స్ అధికారి పదవిని అక్కౌంట్స్ అధికారి (ఫైనాన్స్)గా మార్పు చేశారు. ఇక్కడ పని చేసిన కిషోర్ అమలాపురానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్‌ను పలువురు అధికారులు, సిబ్బంది, స్పాట్‌బిల్లింగ్ కాంట్రాక్టర్లు దయాల్, గంగాధర్, మోహన్, శంకర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

పల్లెల అభివృద్ధికి కృషి

ఏలూరు రూరల్ : పల్లెల అభివృద్ధికి పవన్ కృషి చేస్తున్నారని రాష్ట్ర, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. చాటపర్రులో గురువారం దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన జనసేన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొల్లేరు ప్రజలకు అండగా ఉంటామని పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి అధ్యక్షుడు కె.గోవిందరావు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు చెప్పారు. ఎంపీపీ పి.శ్రీనివాసరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి సహకరించాలి

ఏలూరు (టూటౌన్): స్థానిక అమీనాపేట ఏటి గట్టు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మాలజాతి మల్టీపర్పస్ భవన నిర్మాణం పూర్తయ్యేందుకు సహకరించాలని కోరుతూ వివిధ సంఘాల మాలజాతి నాయకులు గురువారం ఎమ్మెల్యే బడేటి చంటిని కలిసి వినతి పత్రం అందజేశారు. గత కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తమ భవన నిర్మాణానికి ప్రొసీడింగ్స్ ఇవ్వగా మున్సిపల్ కాంట్రాక్టర్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనులు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి సంజీవ్ కుమార్, నేతల రమేష్, మెండెం సంతోష్ కుమార్, దాసరి ఆంజనేయులు, పాము శామ్యూల్, పల్లెం ప్రసాద్, దాసరి రమేష్, మెండెం ఆనంద్ ఉన్నారు.

నేడు గ్యారవీ షరీఫ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కుండీ సెంటర్‌లోని హజరత్ మౌలా అలీ ముష్కిల్ కుష ఆస్థాన (గొలుసుల పంజా)లో శుక్రవారం గ్యారవీ షరీఫ్ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గొలుసుల పంజా వంశ పారంపర్య ముజావర్లు ఎండీ వజీర్ అలీ, ఎండీ గాలబ్ అలీ, ఎండీ మౌలా అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవంలో భాగంగా సాయంత్రం జండా ఊరేగింపు, అనంతరం దరూత్ సలాం, ఫాతెహాఖానీ, దువా ప్రార్థనలు నిర్వహిస్తామని వివరించారు. రాత్రి 7 గంటలకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

21, 22 తేదీల్లో జాతీయ రైతు సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ రంగ సమస్యలపై ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించే జాతీయ రైతు సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో గురువారం సంఘం జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ సదస్సులో కేరళ మంత్రి ఎంబీ రాజేష్, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, విద్యుత్ రంగ నిపుణులు కె.అశోక్‌రావు, ఇరిగేషన్ రిటైర్డ్ ఛీఫ్ ఇంజినీర్ ఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. రైతులు, కౌలు రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు, ఐక్య ఉద్యమాల ప్రాధాన్యత తదితర అంశాలపై చర్చిస్తారని చెప్పారు. అన్ని పంటల రైతులు ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, కోనా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ ప్రాంతాల్లో అత్యవసర పనులు, మరమ్మతులు నిమిత్త శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణాపురం, గులాబీ తోట, నెహ్రూ కాలనీ, విజయ గార్డెన్స్, మినీ బైపాస్, పవర్ పేట, పాత బస్టాండ్, గూడ్స్ షెడ్ రోడ్డు, వసంత మహల్ సెంటర్, పడమర వీధి, గొల్లాయగూడెం, సుబ్రహ్మణ్యం కాలనీ, వంగాయ గూడెం, గాంధీ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఏలూరు టౌన్, ఏలూరు రూరల్, వట్లూరు, శాంతి నగర్, శనివారపు పేట, పూలపర్రు, కలెక్టర్ బంగ్లా, కలెక్టరేట్, ఆశోక్ నగర్, ఆర్ఆర్ పేట, సంతోష్ నగర్, కోటదిబ్బ, ఏలూరు ఒన్‌టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, వెంకన్నట్యాంక్, కలపర్రు, పెదపాడు మండలం, కొత్తూరు జూట్ మిల్, తంగెళ్లమూడి, జానంపేట, ఏలూరు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. ఆటోనగర్, కొమరవోలు, తూర్పు లాకులు, సాయి నగర్, తిమ్మారావు గూడెం, కోటేశ్వర దుర్గాపురం, మాధవపురం లైన్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

వరద బాధితులకు సాయం



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న ఎంప్లాయిస్

ఏలూరు(మెట్రో): విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఏలూరు ఇరిగేషన్ ఎంప్లాయిస్ కోపరేటివ్ త్రి డెట్ వారు గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50,000 చెక్కును జిల్లా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వికి జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ సీహెచ్ దేవ ప్రకాష్ అందజేశారు. ఇరిగేషన్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ త్రిడెట్ జనరల్ సెక్రెటరీ బాపయ్య, జాయింట్ సెక్రెటరీ డి.రమణ ఉన్నారు.

పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై సమీక్ష

ఏలూరు(మెట్రో): గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలని, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులకు సూచించారు. స్థానిక జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లా పంచాయతీ అధికారితో ఆమె సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్యకలాపాలు, మంచి నీటి సరఫరా పథకాల నిర్వహణపై సమీక్షించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో బీసీ కాలనీ, చాటపర్రులోని యాదవులపేటలో రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురువారం శంకుస్థాపన చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. ఆయన వెంట అధికారులతోపాటు పార్టీ నాయకులు ఉన్నారు.

ఎద్దుల అక్రమ రవాణా నిందితుల పట్టివేత

భీమడోలు: జాతీయ రహదారి సూరప్పగూడెం బస్టాండ్ వద్ద ఎద్దులను అక్రమంగా రవాణా చేస్తున్న కేరళకు చెందిన నలుగురు వ్యక్తుల ముఠాను గురువారం రాత్రి ఎస్సై వై.సుధాకర్ పట్టుకున్నారు. ఒరిసా నుంచి తమిళనాడులోని సెలంకు 40 ఎద్దులను కంటైనర్‌లో తరలిస్తుండగా సీజ్ చేశారు. ఎద్దులను పెదపాడులోని గో సంరక్షణ సమితికి తరలించారు. కేరళకు చెరందిన జీజో సీజే, షానీమూన్ ఓమ్, రాబిన్ ఎంబీ, జాబీర్ సీఎస్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి కార్యక్రమాలు



జిల్లా గ్రంథాలయంలో వాల్మీకికి నివాళులర్పిస్తున్న చదువరులు

ఏలూరు (టూటౌన్) : మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. సీఆర్ రెడ్డి కళాశాలలో సంస్కృత విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్–2, ఐక్యూసి సంయుక్త ఆధ్వర్యంలో వాల్మీకి జీవిత విశేషాలు అనే అంశంపై ప్రిన్సిపాల్ కేఏ రామరాజు అధ్యక్షతన అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన డాక్టర్ ఎ.రామకృష్ణ మాట్లాడుతూ వాల్మీకి జీవితారంభ దశలో కిరాతుడని ప్రచారంలో ఉన్న కథకు చారిత్రక ఆధారాలు లేవన్నారు. వాల్మీకికి అగ్నిశర్మ, రత్నాకరుడు అనే ఇతర పేర్లు కూడా ఉన్నాయని చెప్పారు. కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, సంస్కృత శాఖా అధ్యక్షుడు కేవీఎస్ టీపీ ఆచార్య ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహించారు. రామాయణ కావ్యాన్ని రచించిన వాల్మీకి జీవితాన్ని, కవిత్వాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. తెలుగు అధ్యాపకులు ఎస్ పరమేశ, సీపీడీసీ సభ్యులు ఎల్ వెంకటేశ్వరరావు, లయన్స్ జోన్ చైర్మన్ దిడ్ల ఏంజిలో, స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎం శ్రీనివాసరావు, వైఎస్ ప్రిన్సిపాల్ ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో...

ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా సంస్కృతంలో మొట్టమొదటి కవులు అయిన మహర్షి రామాయణాన్ని రచించిన ఆదికవి, మహర్షి వాల్మీకి జయంతిని జిల్లా గ్రంథాలయ సంస్థ ఏలూరు జిల్లా గ్రంథాలయంలో నిర్వహించారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సంస్కృతంలో శ్లోకం అనే ప్రక్రియను కనుగొన్నది వాల్మీకి అని గుర్తు చేశారు. వాల్మీకి రాసిన రామాయణంలో 24 వేల శ్లోకాలు, ఏడు ఖండాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఎం శ్యామలబాబు, పి.అపర్ణ కుమార్, పి.కృష్ణారావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటిసందీప్ కుమార్, ఎండీఏ అస్లాంపాషా, పాఠకులు పాల్గొన్నారు.

శ్రీరాముని చరితను అందించిన వాల్మీకి

ఏలూరు(మెట్రో) : పురుషోత్తముడు శ్రీరాముని దివ్య చరితను పరమ పవిత్రమైన రామాయణం రూపంలో వాల్మీకి మహర్షి ప్రపంచానికి అందించారని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏలూరు శాంతినగర్ లోని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుక నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. కూటమి నాయకులు నందిగం బాబి, మాగంటి హేమ సుందర్, వీర్ల ప్రతాప్, నందిగం రవి, చల్లగొళ్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి



సర్దుబాటు చార్జీలను తగ్గించాలని కోరుతున్న కిషోర్

ఏలూరు (టూటౌన్): ట్రూ ఆఫ్ సర్దుబాటు విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర డిమాండ్ చేశారు. సీపీఎం ఏలూరు నగర కమిటీ సమావేశం కె.రామాంజనేయులు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్తు రంగంలో అమలవుతోన్న ట్రూఆఫ్, సర్దుబాటు విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధరలు, ఛార్జీల పెంపుదలపై ఎన్నికలకు ముందు టీడీపీ బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. అధికారం చేపట్టాక గతాన్ని మించి ప్రజలపై చార్జీల బాదుడు పెట్టవద్దని కోరారు. విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ ఈనెల 18న విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని చెప్పారు. సమావేశంలో నగర కమిటీ సభ్యులు బి.జగన్నాథరావు, వీవీఎన్ ప్రసాద్, జి.రవికిషోర్, వైఎస్ కనకారావు, ఎం.అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన కోసం శిబిరాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): న్యాయ వ్యవస్థపై అవగాహన కోసం విద్యార్థులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని సెయింట్ గ్జేవియర్ బాలుర వసతి గృహాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఇక్కడ అందుతున్న వసతులపైన, వసతి గృహాల పరిశుభ్రత, మంచి నీరు, ఆహారం, వైద్యం, రక్షణ సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాలల హక్కులపై అవగాహన కల్గించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ పి.వెంకటేశ్వరరావు, హాస్టల్ వార్డెన్ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన

భీమడోలు: నిరుద్యోగ మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ అన్నారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల మండల శాఖ ఆధ్వర్యంలో బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహితుల అభివృద్ధి సంస్థ (హైదరాబాద్) ఆర్థిక సహకారంతో 37 రోజుల పాటు 100 మంది మహిళ, యువతకు చేపట్టిన మగ్గం, జర్దోసి శిక్షణ తరగతులను గురువారం భీమడోలు అమ్మవార్ల ప్రాంగణం వద్ద బైరెడ్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డి.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌లు ప్రారంభించారు. కార్యక్రమానికి స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రోగ్రామ్ ఇన్‌చార్జి కె.నాగప్రసాద్ అధ్యక్షత వహించారు. డైరెక్టర్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు మగ్గం, జర్దోసిలకు ఎంతో డిమాండ్ ఉందని, శిక్షణలో మెలకువలను నేర్చుకుని రాణించాలన్నారు. శిక్షణ తర్వాత బ్యాంకర్ల నుంచి రుణాలు పొంది సొంతంగా యూనిట్ల స్థాపన చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. తొలుత సత్యసాయి చిత్రపటం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కోఆర్డినేటర్ శ్యాంప్రసాద్, గ్రామకార్యదర్శి కేవీఎల్ తనూజ, కన్వీనర్ వర్ధినీడి సత్యసాయి, బ్యాంకు మేనేజర్లు శివకృష్ణ, రమేష్, జిల్లా, సమితి పదాధికారులు, సేవాదళ్, భక్తులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి మందుల సరఫరా నిలుపుదల సిగ్గుచేటు

ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పన ప్రసాద్ ఆగ్రహం

దెందులూరు: దెందులూరు సీహెచ్‌సీకి నెల రోజులుగా 33 రకాల మందులు, సూదులు, ఇంజెక్షన్లు, ఐవీ క్యాన్స్, కాటన్, గ్లౌజ్‌లు సరఫరా చేయలేకపోవడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పన ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన తన కార్యాలయంలో కూటమి ప్రభుత్వం దెందులూరు సీహెచ్‌సీకి మందులు సరఫరా చేయకపోవడం పట్ల నల్లబ్యాడ్జీతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.2.75 కోట్లతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో దెందులూరు సీహెచ్‌సీని ఆధునీకీకరించి, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే మందులు కూడా సరఫరా చేయలేక చేతులెత్తేయడం దుర్మార్గమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ఆరోపించారు. దెందులూరు సీహెచ్‌సీకి నాలుగు మండలాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సుమారు వందకు పైగా రోగులు వస్తున్నారని తెలిపారు. వైద్యులందరూ అంకితభావంతో సేవలందిస్తున్నా, పరికరాలున్నా, టాబ్లెట్స్, ఇంజెక్షన్స్ లేకపోతే రోగులు వైద్యం ఎలా చేయించుకుంటారని ప్రశ్నించారు. 10 రోజుల్లో సీహెచ్‌సీకి ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33 రకాల మందులు, టాబ్లెట్స్ రాకపోతే భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని అప్పనప్రసాద్ వెల్లడించారు.

28 నుంచి రిలే దీక్షలు

దెందులూరు సీహెచ్‌సీకి కూటమి ప్రభుత్వం మందులు సరఫరా చేయకపోతే ఈ నెల 28 నుంచి రిలే నిరాహారదీక్ష చేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, దెందులూరు సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యుడు కట్టా ఏసుబాబు గురువారం అన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	36
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	29

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	42-48	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	56-96
వంకాయలు (కాంతులు)	40-60	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	54	ములక్కాడలు	07,10
బెండకాయలు	28	కంద	60
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	36-44
కాకర కాయలు	36-40	కీరా దోస	40
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	00
బీరకాయలు (పందిరి)	54	అల్లం	80-150
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	54-60	పాలకూర	12
దొండకాయలు	32	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	30-54	గోంగూర	07
గోరుచిక్కుడు	32	పుదీనా	05
దోసకాయలు	32-44	బఠాణి	--
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40